



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాగునీటి సరఫరా పథకాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

ఎంపీ, ఎమ్మెల్యేలకు సిఐటియు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో తాగునీటి సరఫరా పథకాల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆదివారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తదితరులు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. భవిష్యత్తులో సమస్య లేకుండా ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఈ పథకాలు సక్రమంగా అమలయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన క్వాలిటి కంట్రోల్, క్వాలిటి అసెస్‌మెంట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టిందని, కూటమి ప్రభుత్వం వాటిని ఉప సంహరించాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆ ప్రతిపాదనలు అమలైతే తాగునీటి సరఫరా పథకం నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని, కార్మికులను తొలగించే పరిస్థితి ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తాగునీటి పథకం పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించడం సిఐటియుగా స్వాగతిస్తూ అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 5 నుంచి నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సకాలంలో కార్మికులకు వేతనాలు అందేలా చూడాలన్నారు. కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు వేతనాలు బ్యాంకు ఖాతాల ద్వారానే చెల్లించాలన్నారు. గత ప్రభుత్వంలో సమ్మె సందర్భంగా అక్రమంగా కార్మికుల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేసేటట్లు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, త్రిలోక్, నాగరాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగని పొలిటికల్ హీట్

- వివాదాలకు కేంద్ర బిందువుగా తాడిపత్రి
- ఇద్దరు నేతల మధ్య సాగుతున్న యుద్ధం
- భయాందోళనలో పట్టణ ప్రజలు
- 29న వైసిపి నేతల ఇళ్ల వద్ద ధర్నాకు టిడిపి పిలుపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తాడిపత్రి అంటేనే ఆధిపత్యపు పోరుకు పరాకాష్టంగా మారింది. అటు వైసిపి అధికారంలోనున్న ఇటు టిడిపి అధికారంలో ఉన్నా ఎప్పుడూ ఉద్రిక్తతల నడుమే రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. గత ప్రభుత్వ హయంలోనూ అదే జరిగింది. ఇప్పుడు అదే జరుగుతోంది. గత ప్రభుత్వ హయంలో అధికార వైసిపి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పూర్తి స్థాయి ఆధిపత్యం చెలాయించే ప్రయత్నం చేశారు. నేరుగా జెసి. ప్రభాకర్‌రెడ్డి ఇంటిలోకెళ్లి కుర్చీలో కూర్చొని వచ్చారు. ఆ సమయంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఆ తరువాత మున్సిపల్ ఎన్నికల సమయంలో రెండు పార్టీల మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే నడిచింది. అయితే ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా తాడిపత్రి పురపాలక సంఘంలో అత్యధిక స్థానాల్లో టిడిపి గెలుపొందింది. ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ అయ్యారు. ఆ ఐదేళ్లు ఇద్దరు నేతల మధ్య తరచూ వివాదాలు నడుస్తూనే వచ్చాయి. ఇక ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఘర్షణలే చోటు చేసుకున్నాయి. ఎన్నికల రోజు అనేక చోట్ల నేరుగా రెండు గ్రూపుల మధ్య పరస్పరం దాడులు సైతం జరిగాయి. ఎన్నికల అనంతరం కూడా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీన్ని అరికట్టలేకపోయారని ఏకంగా ఎస్పీనే ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆయనతోపాటు డిఎస్పీ, సిఐలపైనా వేటు పడింది. ఇప్పటికీ వారు పోస్టింగుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక ఎన్నికల అనంతరం టిడిపి అధికారంలోకి రావడంతో జెసి.ప్రభాకర్‌రెడ్డి పూర్తి స్థాయి ఆధిపత్యానికి ప్రయత్నిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో అడుగుపెట్టనివ్వకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆయన మొదటిసారి పోలీసు స్టేషన్‌లో బెయిల్ కోసం వెళ్లిన సమయంలోనూ పోలీసు పహారా నడుమ వెళ్లివచ్చారు. గత వారంలో మరోమారు అడుగుపెట్టే ప్రయత్నం చేస్తే ఏకంగా ఇంటిపై దాడి చేయడడంతోపాటు , మరో నాయకుడి ఇల్లు , వాహనాలు ధ్వంసం చేశారు. ఈ దాడిని వైసిపి నాయకులు ఖండించారు. ఈ మేరకు స్పందించిన నేతల ఇళ్ల వద్ద ఈనెల 29వ తేదిన ధర్నాచేయడానికి తాడిపత్రి టిడిపి మహిళా నాయకులు ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఈ ధర్నాకు దిగితే మరోమారు వారి మధ్య ఏరకమైన పరిణామాలు చోటు చేసుకుంటాయన్నది సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. వైసిపి నాయకులు దీనికి ఏ రకంగా ప్రతిస్పందిస్తారో చూడాల్సి ఉంది. తాడిపత్రి నియోజకవర్గ రాజకీయాల్లో పొలిటికల్ హీట్ ఎప్పుడూ ఉంటుంది. ఇద్దరు నేతల మధ్య సాగుతున్న పోరు ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో అన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. దీన్ని అరికట్టే విషయంలో పోలిసు శాఖ ఏమేరకు సఫలీకృతమవుతుందో చూడాల్సి ఉంది. గతంలో విఫలమై ఇబ్బందులు పడిన అధికారులూ ఉన్నారు. కొత్తగా వచ్చిన ఎస్పీ తాడిపత్రి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఏ రకమైన చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.

పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా

- పగలు ట్రాక్టర్ల ద్వారా డంపునకు..
- రాత్రిళ్లు టిప్పర్లతో తరలింపు
- పెరవలి కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని పెరవలి గ్రామ కేంద్రంగా ఇసుక మాఫియా పెట్రేగిపోతోంది.. రాత్రి.. పగలు యథేచ్ఛగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒకవైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేదలందరికీ ఉచితంగా ఇసుక ఇవ్వాలని చెబుతుండటంతో పాటు.. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ కింది స్థాయి అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. గ్రామానికి చెందిన ఓ టిడిపి నాయకుడు జేసీబీ, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో అధికారికంగా ఎక్కడా ఇసుక రీచ్ ఓపెన్ చేయలేదు. అయితే పెరవలి టిడిపిలో ఒక నాయకుడు మాత్రం గ్రామానికి ఆనుకుని ఉన్న పట్టా భూముల్లో ఇసుక తోడి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. పగలు జేసీబీ తో ట్రాక్టర్ల ద్వారా గ్రామానికి ఆనుకుని ఉన్న దొడ్లల్లో ఇసుక డంపునకు తరలిస్తాడు. అక్కడి నుంచి రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా అనంతపురం తోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తాడు. రోజూ పదుల సంఖ్యలో టిప్పర్లను తరలిస్తున్నాడు. ఇకపోతే పగలు గ్రామంలోని సచివాలయ ముందు నుంచే డంపునకు తరలిస్తున్న సచివాలయ సిబ్బంది మాత్రం పట్టించుకోకపోవడం పట్ల పలు విమర్శలకు తావిస్తోంది. మరోవైపు అటు రెవెన్యూ, ఇటు పోలీసు శాఖకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరందరికీ అమ్యామ్యాలు ముట్టడం వల్లే పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే సామన్యుడు ఇంటికి సొంత ట్రాక్టర్ తో తొలుకుంటే ప్రతాపం చూపే అధికారులు టీడీపీ లో ఒక నాయకుడు ఇలా బరితెగించి ఇసుక తరలిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.



ఇసుక తవ్వుతున్న జెసిబి

అధికారులూ తస్మాత్ జాగ్రత్త..

అధికారులూ తస్మాత్ జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఈ నాయు'కు'డు వల్లే గత టీడీపీ హయాంలో ఇసుక కేసులో ముగ్గురు అధికారులు సస్పెండ్ అయ్యారు. గతంలో ఉల్లికల్లు ఇసుక రీచ్‌లో నిబంధనలను అతిక్రమించి ఇసుక తొలడంతో పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నిబంధనలు అతిక్రమించారని ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. దీనికితోడు అప్పట్లో మహిళా సంఘాల సభ్యులకు కూడా నిర్వహణ బాధ్యత ఉండటంతో వారిని కూడా అప్పటి ఎమ్మెల్యే పిలిపించుకుని చీవాట్లు పెట్టారు. ఇప్పటికీ ఆ మహిళా సభ్యురాలు ఈ మొనగాని గురించి... ఈయన రాచ కార్యం గురించి వాపోతూ ఉంటుంది. ఈ టీడీపీ నాయకుడి వల్లే అధికారుల పై వేటు పడిందని ఇప్పటికీ చెబుతూ ఉంటారు. కావున అధికారులు టీడీపీ నాయకుడి ప్రలోభాలు.. బెదిరింపులకు లొంగకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది అని గతంలో ఈ నాయకుడి గురించి తెలిసిన వారు చెబుతున్నారు. ఇప్పటికైనా అటు రెవెన్యూ. ఇటు పోలీసు అధికారులు స్పందించి ఇసుక తరలిస్తున్న టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'పిటిసి'లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని పీటీసీ మైదానంలో మౌళిక వసతుల కల్పనతో పాటు అనేక మార్పులకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆయన ఆదివారం పీటీసీ మైదానంలో మున్సిపల్ ఆర్డి ఇంచార్జ్ కమిషనర్ వివిఎస్ మూర్తితో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఎన్నికల ముందు ఆయన పీటీసీలో మార్నింగ్ వాక్ నిర్వహించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించి అక్కడ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వాకర్స్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. అలాగే కమిషనర్ తో కలిసి కాసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు. ఆ తర్వాత కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న యువకులతో మాట్లాడి వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. వాకర్స్ అసోషియేషన్ నాయకులు ఎమ్మెల్యేని కలిసి వాకింగ్ ట్రాక్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అలాగే ఓపెన్ ఎయిర్ జిమ్ లో పరికరాలన్నీ దెబ్బతిన్నాయన్నారు. కనీసం వాకర్స్ కి తాగునీరు, టాయిలెట్స్ కూడా లేవన్నారు. మైదానంలో డస్ట్ బిన్ కూడా లేకుండా పోయిందన్నారు. వీటిన్నింటిన విన్న తర్వాత కమిషనర్ తో మాట్లాడుతూ మొత్తం అన్నింటికీ అంచనాలు సిద్ధం చేయాలన్నారు. రెండు మూడు రోజుల్లో కనీస మౌళిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రధానంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్, తాగునీరు, బాత్ రూమ్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దష్టికి తీసుకెళ్లి దానిని ఏర్పాటు చేస్తామన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు సూరిబాబు

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి సూరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్ సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నబి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం నాగమణి, ఎస్. నాగేంద్రకుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 5వ తేదీన తిరుపతిలో సీఎండీ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు సంబందించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సూరిబాబు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ రంగంలోని మూడు డిస్కంలు ఈపీడీసీఎల్ విశాఖపట్నం, సి పి డి సి ఎల్ విజయవాడ, ఎస్పీడీసీఎల్ తిరుపతి పరిధిలో 23500 కాంటాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. పీస్ రేట్ కార్మికులు , మీటర్ రీడర్లు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్పీఎం హమాలీలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కార్మికులు 6వేల మందిదాకా పనిచేస్తున్నారన్నారు. ట్రాన్స్‌కో, జన్‌కో, డిస్కం మూడు డిస్కంలో పరిధిలో 17500 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ థర్డ్ పార్టీ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారని ఈ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే ఈ కార్మికులందరినీ విలీనం తీసుకొని నేరుగా వారికే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగా రిక్రూట్‌మెంట్ చేసిన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత కార్మికులకు ఇస్తున్న వేతనాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేసి కాంట్రాక్ట్ కార్మికులందరినీ విలీనం చేసుకొని వేతనాలు, డిఎ, హెచ్ఆర్ఎ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాచ్‌మెన్లను ప్రతి సబ్‌స్టేషన్‌లో నియమించాలని కోరారు. నైపుణ్యతలేని వాచ్‌మెన్లను ఫీల్డ్ లో వినియోగించడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాచ్‌మెన్లను సబ్‌స్టేషన్‌లోనే పనిచేయించాలని కోరారు. ఈపీఎఫ్ ఈఎస్ఐ చట్టాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు ఈపీఎఫ్ ఈఎస్ఐ చెల్లించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని వారి కాంటాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిల్ కలెక్టర్లు, రెవెన్యూ క్యాషియర్లకు ఎలాంటి ప్రభుత్వ సెలవులు మంజూరు చేయకుండా వారికి పని ఒత్తిడి పెంచుతున్నారని దీనివల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ సెలవుల్లో పనిచేస్తే క్యాంపెన్సర్ లెటర్ ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నా వాటిని అధికారులు తుంగలో తొక్కడం సరికాదన్నారు వారికి ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 1998, 2002 సంవత్సరాలలో సిఐటియు అనుబంధ సంఘం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమరశీల పోరాటం చేయడం వల్ల 6వేల మందిని రెగ్యులర్ చేశారని, 2007లో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 7014 మందిని కాంటాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేశారని గుర్తు చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే దిశలో అడుగులు వేస్తోందని అదానీ, అంబానీ వంటి కార్పెట్ దిగ్గజాలకు ఈ రంగాన్ని అప్పగించేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ జరిగితే ప్రజలపై భారాల పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వ రంగంలోనే విద్యుత్ రంగం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన హక్కుల కోసం సిఐటియుగా ఐక్యమత్యంతో పోరాడుతామన్నారు. విద్యుత్ రంగం ఎంతో కీలకమైన వ్యవస్థని వాటిని పటిష్టం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. హక్కులు సాధించడానికి సమస్యలు పరిష్కరించుకోవడానికి ఐక్య పోరాటాలే మార్గమని అన్నారు. సెప్టెంబర్ 5వ తేదీన తిరుపతిలో సీఎండీ కార్యాలయం ఎదుట చేపడుతున్న ధర్నాకు హాజరై విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీ పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మారుతి కుమార్, రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం రామచంద్ర, కాంటాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు మధు, మహబూబ్ బాషా, ఎస్‌కెఎం బాషా, సెక్యూరిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాగభూషణ్ రెడ్డి, స్టోర్ హమాలీ యూనియన్ నాయకులు గంగాధర్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం

జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి



ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విద్యార్థులకు మెనూ ప్రకారం చక్కటి పౌష్టికాహారం అందించడమే తమ శాఖ లక్ష్యమని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి తెలిపారు. పేద విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం వారికి విద్యతోపాటు పుస్తకాలు, పౌష్టికాహారం అందిస్తోంది. ఎస్సి, ఎస్టి, బిసి విద్యార్థులు ఎందరో ప్రభుత్వ సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. అయితే సంక్షేమ హాస్టళ్లలో పలుచోట్ల అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించకపోవడం, అవసరమైన కాస్మొటిక్స్ సమకూర్చకపోవడం, పలు హాస్టళ్లకు ప్రహరీలు లేకపోవడం, కొన్నిచోట్ల టాయిలెట్స్ బాత్రూంలు సరిగా లేకపోవడం, కొన్నిచోట్ల ఫ్యాన్లు లేకపోవడం లాంటి సమస్యలు నెలకొని ఉన్నాయి. హాస్టళ్ల నిర్వహణ ప్రధానంగా వార్డెన్లు, వంట మనుషులపై ఆధారపడి ఉంటాయి. వేలాదిమంది పేద విద్యార్థులు హాస్టళ్లపై ఆధారపడి విద్యను అభ్యసిస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా బీసీ సంక్షేమ వసతి కేంద్రాల శాఖ అధికారి నిర్మల జ్యోతి ప్రజాశక్తి కి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూ లో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి? విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.?

జవాబు : జిల్లా వ్యాప్తంగా 57 బిసి సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో 41 హాస్టళ్లకు సొంత భవనాలుండగా , మరో 16 హాస్టళ్లు అద్దె భవనాలలోను దాతల సహకారంతో ఏర్పాటుచేసిన భవనాల్లోనూ కొనసాగుతున్నాయి. సొంత భవన నిర్మాణాలకు ఉన్నత అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించాము. నిధులు మంజూరును బట్టి భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 5502 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్ర : మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు తెలపండి.?

జ : వారానికి ఐదు సార్లు కోడిగుడ్లు అందిస్తున్నాము. చికెన్ 2 సార్లు అందిస్తాము. ఆదివారం చికెన్ బిర్యాని అందిస్తాం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ఇవ్వడం జరుగుతుంది. ఎప్పటికప్పుడు శుభ్రంగా వేడిగా భోజన పదార్థాలు అందిస్తున్నాం.

ప్ర : జిల్లాలో ఎంతమంది వార్డెన్లు ఉన్నారు? వంట మనుషులు సరిపడా ఉన్నారా.?

జ : ప్రస్తుతమైతే 24 మంది వార్డెన్లు ఉన్నారు. జిల్లాలో ఇటీవల కొంతమంది వార్డెన్లు పదవీవిరమణ చేశారు. ఆ పోస్టులను భర్తీ చేయడానికి 25 మంది వార్డెన్లు అవసరం ఉంది. కొత్తవారిని ప్రభుత్వం నియమించవలసి ఉంది. ఉన్న వారితోనే నడుపుతున్నాము. వంట మనుషులు ఆరుగురు అవసరమవుతారు. త్వరలోనే వారిని నియమించుకునేందుకు చర్యలు తీసుకొంటాం.

ప్ర: పలు వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి? ఏం చర్యలు తీసుకొంటున్నారు.?

జ : వసతి గృహాలకు బాత్ రూములు, టాయిలెట్స్, ప్రహరీ నిర్మాణం, విద్యుత్ సరఫరా తదితర మరమ్మతుల పనులు ఉన్నాయి. వీటి కోసం ప్రభుత్వం రూ.1200 లక్షలు మంజూరు చేసింది. అవసరమైన హాస్టళ్ల లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు వినియోగించి పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

ప్ర : విద్యార్థులకు కాస్మొటిక్స్ అందిస్తున్నారా? అన్ని హాస్టళ్లలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తున్నారా.?

జ : ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు సబ్బులు, షాంపూ తదితర కాస్మొటిక్స్ అందిస్తున్నాము. అన్ని హాస్టళ్లలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. ఈ విషయమై తరచూ తాము హాస్టళ్లను పర్యవేక్షణ చేస్తున్నాం. మెనూ ప్రకారం ఆహారం అందించకుంటే సిబ్బందిపై తగు చర్యలు తీసుకొంటాం.

ప్ర: జిల్లా కేంద్రంలో మీ కార్యాలయానికి సొంత భవనం ఉందా? సిబ్బంది కొరత ఉందా?

జ: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో తమ కార్యాలయానికి సొంత భవనం లేదు. నూతనంగా జిల్లా ఏర్పడి రెండేళ్లు అవుతోంది. ప్రభుత్వం స్థల సేకరణ చేసింది. మరి ఎప్పుడు నిర్మిస్తారనేది ప్రభుత్వంపై ఆధారపడి ఉంది. ప్రస్తుతమైతే సత్యసాయి దీన జనోద్ధారణ భవన సముదాయాలలో కార్యాలయం నడుస్తోంది. సిబ్బంది 8 మంది ఉన్నారు. వారితోనే సర్దుకు పోతున్నాము.



జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి

ప్ర: విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలు ఏమిటి.?

జ: ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఏటా కోట్లరూపాయలు ఖర్చు చేస్తోంది. హాస్టళ్ల లో ఉంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచిస్తున్నాం. విద్యార్థుల తల్లితండ్రులు కూడా తమ పిల్లలు సెలవు రోజుల్లో ఇంటికి వచ్చినప్పుడు వారి ప్రవర్తనలు గమనించాలి. ఎలా చదువుతున్నారో అని అడిగి తెలుసుకుంటూ కుటుంబ పరిస్థితులు వివరిస్తూ బాగా చదువుకోవాలని ప్రోత్సహించాలి. అధికారులు హాస్టళ్ల తనిఖీకి వచ్చినప్పుడు విద్యార్థులు తమ ఇబ్బందులు తెలపాలని కోరుతున్నాం.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్



మహిళా సంఘాల సభ్యులు మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్‌పర్సన్ తదితరులు

అక్కా చెల్లెమ్మలను లక్షాధికారులు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం లక్ పతి దీది పథకాన్ని ప్రవేశపెట్టిందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "లఖ్ - పతి దీదీ' కార్యక్రమం కింద మహిళలను సత్కరించే కార్యక్రమాన్ని అనంతపురం కలెక్టరేట్ లోని ఎన్ఐసి భవనం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనంతపురం ఎంపీ, ఇన్‌ఛార్జి కలెక్టర్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే తదితరులు వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం కింద అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతపురం మహిళా సంఘాలకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఓబులమ్మ, ఎపిడి ఈశ్వరయ్య, స్వయం సహాయక సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం జంక్షన్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడంతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పించాలని రాయదుర్గం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్ కోరారు. ఆదివారం అనంతపురంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీ లక్ష్మీనారాయణను నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో నూతన రైల్వేస్టేషన్ భవనం ప్రారంభించినప్పటికీ మరుగుదొడ్లు, తాగునీరు, కూర్చునే బెంచీలు, వీధి దీపాలు, మొదలైన మౌలిక సౌకర్యాలు లేవన్నారు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండానే కొత్తస్టేషన్ బిల్డింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. కాగా రాయదుర్గం మీదుగా వెళ్లే వారణాసి–మైసూర్, యశ్వంత్‌పూర్–టాటానగర్, జైపూర్–యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రాయదుర్గం స్టేషన్‌లో ఆపాలని, దొడ్డహాళ్లి–తిరుపతి రైలును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉమామహేశ్వరయ్య, లక్ష్మయ్య శెట్టి, విష్ణుతేజ తదితరులు ఉన్నారు.

కనకదాస్ విగ్రహాల ఏర్పాటుకు కృషి

కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని వివిధ గ్రామాల్లో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు తెలిపారు. ఆదివారం కుందుర్పి మండల కేంద్రంలో మండల కురుబ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో కనకదాస కళ్యాణ మండపం నిర్మించడంతోపాటు అన్ని గ్రామాల్లోనూ కనకదాస విగ్రహాలను ఏర్పాటు, కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించేందుకు తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కురుబలు అత్యధిక శాతంగా ఉన్నారన్నారు. వారందరికీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణపల్లి నాగరాజు, మండల అధ్యక్షులు రమేష్, నియోజకవర్గ కురుబ సంఘం సీనియర్ నాయకులు కురుగొండ, నాగరాజు, కరే గౌడ, రామకృష్ణ, మల్లికార్జున, తిమ్మరాజు, విటల్, కురుమ సంఘం శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు

వర్షాలకు కూలిన ప్రహరీలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఇటీవల కురిసిన వర్షాలకు రాయదుర్గం పట్టణంలోని పలు కట్టడాలు నేలకూలాయి. శాంతినగర్‌లోని చంద్రబాబు పార్కు ప్రహరీ శిథిలావస్థలో ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు కూలింది. అదేవిధంగా బళ్లారి రోడ్డు పక్కన ఉన్న హిందూ రుద్రభూమి ప్రహరీ కూడా నేలకూలింది. అనేకచోట్ల కాలువలపై వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. అవి కూడా ఎప్పుడైనా కూలిపోయే స్థితిలో ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శాంతినగర్, సిద్దేశ్వరకాలనీలో వర్షం నీరు వెళ్లే కాలువలను మట్టితో కప్పి అడ్డుకట్ట వేయడంతో వర్షం నీరు ముందుకెళ్లే దారి లేక రోడ్లపై ప్రవహించి పల్లపు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. దీంతో పలు ఇళ్లలోకి నీరు వచ్చి చేరి ఆస్తి నష్టం సంభవించింది. వర్షపు నీరు ఇళ్లలోకి ప్రవేశించకుండా సహజ సిద్ధంగా ఉన్న వంకలను వాటిపై ఏర్పాటు చేసిన ఆక్రమణలను తొలగించి వర్షపు నీరు ముందుకు వెళ్లేలా అవసరమైన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కూలిన ప్రహరీలను పునర్ నిర్మించాలని కోరుతున్నారు.



కూలిన రాయదుర్గంలోని పార్కు ప్రహరీ

ఆర్యవైశ్యులకు పదవులు కల్పించేందుకు కృషి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి గెలుపొందడానికి ఆర్యవైశ్యులు కృషి చేశారని, కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవులు కల్పించేందుకు కృషి చేస్తామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం అనంతపురం కొత్తూరు అమ్మవారిశాలలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. నా గెలుపులో ఆర్యవైశ్యులు ఎంతో కీలకపాత్ర పోషించారన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం అడిగారని దీనిని కచ్చితంగా నెరవేరుస్తానన్నారు. మరోవైపు వారికి రాజకీయంగా కూడా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ అడిగారని కానీ తాను చైర్మన్ పదవి కల్పించేందుకు పోటీ పడుతున్నట్లు తెలిపారు. మంత్రి టీజీ భరత్‌తో మాట్లాడి చైర్మన్ పదవి వచ్చేలా చేస్తామన్నారు. అనంతపురంలో ఐదు డివిజన్ల నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని దీనిని కచ్చితంగా పరిశీలిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూచిహరి, రాయల్ మురళి, సరిపూటి రమణ, లింగారెడ్డి, తాజుద్దీన్, మున్వర్, మల్లెల దుర్గేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు తలవల రామ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేష్, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మచ్చా నరసింహులు, పాతవూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, ఆర్యవైశ్య సంఘ సభ్యులు కృష్ణం రఘు, తాటి మధు, నాగభూషణం, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

లక్ పతి దీదీ పథకం పై వీక్షణంలో అధికారులు

ప్రజాశక్తి-నార్పల

మహిళా సంఘాల సభ్యులను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లక్‌పత్ దీదీ పథకం తీసుకొచ్చిందని ఎపిఎం తిప్పమ్మ తెలిపారు. ఆదివారం నార్పలలోని కుళ్లాయి స్వామి మండల సమాఖ్యలో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన లక్ పత్ దీదీ లైవ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పర్వీన్, ఎబిఎన్ తిప్పమ్మ, సీసీలు రామచంద్ర, రామకృష్ణ, ఎంఎస్ఎ కోటేశ్వరమ్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



నార్పలలో ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

యల్లనూరు : కేంద్రం ప్రభుత్వం ప్రారంభిస్తున్న 'లక్ పతి దీదీ పథకం'పై మండల కేంద్రంలోని కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపిఎం ముత్యాలప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకంలో మహిళా సాధికారత, స్వయం జీవనోపాధితో మహిళలు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎలు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : ప్రతి మహిళ వివిధ జీవనోపాదులు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎపిఎం నీలామణి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని జననీ మండల సమైక్య కేంద్రంలో ప్రధానమంత్రి నిర్వహించిన 'లక్ పతి దీదీ పథకం' కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాల్లోని మహిళలు వివిధ జీవనోపాదాలు ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభావతమ్మ, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, మండల రైతుసంఘం మాజీ అధ్యక్షుడు ఓబులేసు, బిజెపి మండల కన్వీనర్ ఆంజనేయులు, జనసేన నాయకులు రామదాసు, సీసీలు నరసింహులు, మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్, దొనతిమ్మ, అకౌంటెంట్ ప్రతాప్, యానిమేటర్లు, ఆయా గ్రామాల మహిళా సభ్యులు పాల్గొన్నారు.

మసీదు ప్రారంభం



మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లిలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన మజీదును (మస్జిద్ ఏ ఖాద్రియా)ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముతవల్లిల రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షకీల్ మజీదుకు విరాళంగా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదోనికి చెందిన హజ్రత్ మక్సుద్ షా, గుత్తికి చెందిన హజ్రత్ మంజూర్ ఆలం ఖాద్రీ, అన్వర్ సాహెబ్, కౌన్సిలర్ ఖాజాఖాన్, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీత ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని పంపనూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి అన్నాభిషేకం చేశారు. అనంతరం మండల కేంద్రంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎండోమెంట్ ఇఒ అక్కిరెడ్డి, అర్చకులు రాముస్వామి, ఆలయ బృందం పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగి రాష్ట్రంలో నివాస గృహాలకు విద్యుత్ ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రస్తుతం కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా మీటర్ల బిగింపును వ్యతిరేకించి, అధికారంలోకి రాగానే తిరిగి బిగించాలని నిర్ణయం తీసుకోవడం ప్రజలు, రైతులను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారన్నారు. అనంతరం వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని వివరించారు. మొదటి దశలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్తుకు ఎసరు పెట్టే ప్రమాదం ఉందన్నారు. మీటర్ల బిగింపు వల్ల వినియోగదారులపై వివిధ రూపాల్లో అదనపు భారం పడుతుందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈస్మార్ట్ మీటర్లను ప్రజలు, రైతులపై రుద్దుతోందని తెలిపారు. ప్రజలు, రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అదానీ, షిరిడీసాయి తదితర కంపెనీలతో చేసుకుని ఒప్పందాలను రద్దు చేయాలని, బిగించిన మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మధు, శివ, అంజి, ఓబులేష్, అల్లాబకాష్, అశోక్, కేశవ పాల్గొన్నారు.



సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

డీఎస్సీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు అందించే శిక్షణ ద్వారా త్వరలో జరగనున్న టెట్, డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామం వద్ద ఉన్న టెక్స్‌టైల్స్ పార్కు ఆవరణలో ఆదివారం నుంచి ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధించాలనే పట్టుదల, జ్వలించే కాంక్ష ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ, యువకులు కలిగి ఉండాలన్నారు. తాను కూడా రాజకీయాల్లో కష్టపడి పైకి వచ్చానన్నారు. సమస్యలు అనేవి అందరికీ ఉంటాయని.. అయితే వాటిని అధిగమించాలన్నారు. ఏకాగ్రతతో చదివి అధ్యాపకులు చెప్పిన విషయాలను ఆకలింపు, సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇక్బాల్ శిక్షణ శిబిరానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తారన్నారు. 12 మంది టెట్, డీఎస్సీ శిక్షణలో అనుభవజ్ఞులైన వారిని ఎంపిక చేసి, వారిచే విద్యాబోధన చేయిస్తామన్నారు. రాయదుర్గం ప్రాంతానికి చెందినవారు డీఎస్సీ పరీక్షల్లో ఎక్కువమంది ఎంపిక కావాలని, వారి జీవితంలో బాగుపడాలని తాను చేసే ప్రయత్నాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం పరీక్షలకు ఉపయోగపడే మంచి మెటీరియల్‌ను అందిస్తామన్నారు. ఫిబ్రవరి నెలలో జరగనున్న పరీక్షల్లో ఎక్కువ మంది ఉత్తీర్ణులై ఉద్యోగాలు పొందాలన్నారు. 500 మందికి ఉచిత శిక్షణకు అవసరమైన ఏర్పాట్లను చేస్తామన్నారు. గతంలో 2016 సంవత్సరంలో కూడా గ్రూప్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కళ్యాణదుర్గం ఆర్డీవో డాక్టర్ రాణిసుస్మిత మాట్లాడుతూ రాయదుర్గం ఎమ్మెల్యే చేపట్టిన ఉచిత డీఎస్సీ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ, స్కూల్ అసిస్టెంట్, శిబిరం సమన్వయకర్త ఇక్బాల్, టిడిపి నాయకులు మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నిక

జిల్లా అధ్యక్షులుగా బి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా ఎస్.బాలాజీనాయక్

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని అనంత కృషిభవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా వెన్న రమేష్, ఎన్నికల పరిశీలకులుగా డిఎస్ఎన్ శ్రీనివాస వ్యవహరించారు.



ఉమ్మడి అనంతపురం జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు

ఉమ్మడి అనంతపురం జిల్లా నూతన కార్యవర్గం

ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షులుగా బి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా ఎస్.బాలాజీనాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సివి.రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేషులు, ఎం.రాజగోపాల్, ఎ.రఘుస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జి.నరసిహులు, ఎస్.సల్మాషబ్బీర్ అంజూమ్, జాయింట్ సెక్రటరీలుగా పి.ప్రభాకర్, టి.వెంకటేష్‌బాబు, కె.హఫీజ్, ఏ.పద్మావతి, ట్రెజరర్‌గా కె.స ప్రాణేష్‌రావు, జిల్లా ఈసి మెంబర్‌గా బి.శ్రీనివాసులు, స్టేట్ కౌన్సిలర్‌గా కె.పుల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.సాయికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.రవికుమార్, రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి హెచ్.ఆదామ్‌ఖాన్, ఎపిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి , ఎపి ఎన్‌జీఓ నగర అధ్యక్షులు మర్రిరెడ్డి మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

ఎపిఎంఎస్ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు వర్తింపజేస్తున్న సర్వీస్ రూల్స్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో ఏపీఎంఎస్ఎస్‌టియు జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ స్థాపించి 12 సంవత్సరాలు అయినప్పటికి ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, అమలు చేసి వారికి భద్రత కల్పించాలన్నారు. ఏపిఎంఎస్ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిరత్నం మాట్లాడుతూ మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, తిమయ్యలు మాట్లాడుతూ టిజిటి పోస్టులను పీజిటిగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అర్హులైన పిజిటి, టిజిలకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజినేయులు, రాష్ట్ర సహాధ్యక్షులు సూర్యుడు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎపిఎంఎస్ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రెడ్డి

జిల్లా ఎపిఎంఎస్ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

ఏపి మోడల్ స్కూల్ రాష్ట్ర టీచర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటిని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులు సతీష్ కుమార్, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బాలి రెడ్డి, రాజా రెడ్డి, వెంకటేశులు, రాఘవేంద్ర ప్రసాద్, యోగేశ్వర రెడ్డి, జాయింట్ సెక్రటరీలు మహబూబ్ బాషా, మారుతి, వెంకటపతి, భాస్కర్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-నార్పల

ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ కౌలుట్లయ్య ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరూ అనవసర గొడవలు, వివాదాలకు వెళ్లకుండా సత్ప్రవర్తనతో జీవనం సాగించాలసూచించారు. అలాగే త్వరలో జరగబోయే వినాయక ఉత్సవాలకు వినాయక మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయక ప్రతిష్ట, నిమజ్జన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదే అన్నారు. ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలానే మండలంలోని ప్రజలు కూడా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఇకపోతే ప్రతి ఒక్కరూ మహిళలు, చిన్న పిల్లల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఎవరైనా అసభ్యంగా, దురుసుగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. మండలంలో ఎవరైనా పేకాట, అక్రమ మద్యం, గుట్కాలు, గంజాయి విక్రయించడం లాంటివి ఎక్కడైనా జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న శింగనమల సిఐ కౌలుట్లప్ప

పుట్లూరు : మండలంలోని 12 మంది రౌడీషీటర్లకు సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరైనా గొడవల జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కోమటికుంట్ల గ్రామంలో గొడవపడిన జైలు నుంచి నుంచి బెల్‌పై వచ్చిన వారిని కూడా కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని శ్రీధర్‌కు కేటాయించాలి

అనంతపురం సిటీ : నందమూరి బాలకృష్ణ వీరాభిమాని, అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు కాయగూరల శ్రీధర్‌కు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇవ్వాలని రాయలసీమ బలిజ మహాసంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాయలసీమ బలిజ మహాసంఘం తరపున త్వరలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. ఎందుకంటే శ్రీధర్ చాలాఏళ్లుగా బలిజల అభివృద్ధితోపాటు పార్టీ ఎదుగుదలకు ఎనలేని కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తికి తమ సంఘం మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈమేరకు రెండు, మూడు రోజుల్లో భారీ వాహనాలతో విజయవాడకు బయలుదేరి విన్నవించనున్నట్లు తెలిపారు.

బిఎల్‌ఒలకు అవగాహన

గుంతకల్లు రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్.రమాదేవి మాట్లాడుతూ ప్రత్యేక వేసవి కాల విభాగంలో భాగంగా 2025వ సంవత్సరానికి ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే చేయాలన్నారు. ఓటరు జాబితాలో 18ఏళ్లు ఉన్నవారికి ఓటుహక్కు కల్పించాలన్నారు. ఒకవేళ ఎవరైనా మరణించినా తీసివేయాలన్నారు. రానున్న ఎన్నికలకు ఓటరు జాబితా పక్కాగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం : ఎస్సీ ఎస్టీ బీసీ వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని హరిత దివ్యాంగుల జిల్లా అధ్యక్షులు మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీ బాలుర వసతిగృహం వద్ద ఏర్పాలు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల ఎస్టీ, ఎస్సీ, బీసీ వసతిగృహాలు అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. వాటిల్లో కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవనాల పై కప్పులతోపాటు వర్షాల కారణంగా భవనాలు లీకేజ్ అవుతున్నామన్నారు. దీంతో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి శాశ్వత ప్రభుత్వ వసతి గృహాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఆకుల రఘు రామయ్యకు కవితా పురస్కారం

నార్పల : మండల కేంద్రానికి చెందిన ఆకుల రఘురామయ్యకు తెలుగు వైభవం జాతీయ కవితా పురస్కారం వరించింది. చిత్తూరులోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో నిర్వహించిన తెలుగు వైభవం, జాతీయస్థాయి శతాధిక తెలుగు కవి సమ్మేళనంలో రఘురామయ్యకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల చిన్నికృష్ణ, తెలంగాణ శాసనమండలి సభ్యులు, సాహితీవేత్త, గాయకులు గోరేటి వెంకన్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ జి.సుబ్రమణ్యంశర్మ, తదితరులు రఘురామయ్యకు శాలువా, ప్రశంసాపత్రం, కవిత పురస్కారాన్ని అందజేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

రాయదుర్గం : పట్టణంలోని కనేకల్ రోడ్డు వద్ద ఉన్న ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయదుర్గంలో బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయంలో గీత సారం బోధించడం, రాజయోగ శిక్షణ ఇవ్వడం మొదలైన కార్యక్రమాల ద్వారా ప్రజలకు మానసిక ప్రశాంతత, మంచి జీవన విధానం, మానసిక దఢత్వం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రతినిధి బికె యోగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అనంతపురం క్రైం : ప్రతి సోమవారం అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎస్పీ పి.జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు తలెఇపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

యల్లనూరు : మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిస్కార వేదిక నేడు వాయిదా వేసినట్లు తహశీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం శ్రీకృష్ట జన్మాష్టమి సందర్భంగా రద్దు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను నిలిపివేయాలి

వజ్రకరూరు : రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని సిపిఐ ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి జె.మల్లికార్జున, సీనియర్ నాయకులు మల్లేష్, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం నివాస గృహాలు, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నార్పల : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి అనంతపురానికి చెందిన రుషింగులు భార్య లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు రూ.80వేలను విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆదివారం సంబంధిత మొత్తాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్రస్వామికి అందజేశారు.

నగర ఉత్సవ నూతన కార్యవర్గం ఏర్పాటు

గుత్తి : పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గౌతమపురి నగర ఉత్సవ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా తెగదొడ్డి తిమ్మారెడ్డితోపాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు ప్రధాన కార్యదర్శులు, 20 మంది కార్యవర్గ సభ్యులు, ఆరుగురు గౌరవ సలహాదారులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ వినాయక చవితిని పండుగను భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

గుత్తి : పట్టణంలోని చెర్లోపల్లి కాలనీ చెందిన ఓ యువకుడు ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన కుమార్ (లేట్), ధనలక్ష్మి దంపతుల కుమారుడు సోము (25) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరేసుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనికి వెళ్లిన ఆ యువకుడు తల్లి ధనలక్ష్మి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా పైకప్పుకు వేలాడుతున్న కుమారుడుని చూసి రోధిస్తూ స్థానికులను పిలిచింది. పై కప్పు కు వేలాడుతున్న సోము ను స్థానికుల సహకారంతో కిందకు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఎస్ఐ బి.నబి రసూల్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఆ యువకుడు రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయాలపాలైన ఆనంద్

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపురం గ్రామానికి చెందిన ఆనంద్ అనే యువకుడు గుంతకల్లు మండలం వైటి చెరువు గ్రామంలో జరుగుతున్న బంధువుల వివాహానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రజాపురం గ్రామం వద్ద బైకు బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.